

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# గ్రూప్-1 పరీక్షకు భారీ బందోబస్త్

## -జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
జిల్లాలో ఆదివారం జరగబోతున్న గ్రూప్ -1 పరీక్షల కొరకు భారీ బందోబస్త్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ....జిల్లాలో 15 పరీక్ష కేంద్రాలలో 4857 మంది అభ్యర్థులకు ఆదివారం గ్రూప్ -1 పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఈ పరీక్షలకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా భారీ ఎత్తున పోలీస్ అధికారులతో బందోబస్త్ ఏర్పాటు చేయడం జరిగిందని దాదాపుగా 86 మందిపోలీస్ అధికారులతో బందోబస్త్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గ్రూప్-1 పరీక్షలు రాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని జాగ్రత్తలు తీసుకొని బందోబస్త్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అభ్యర్థులకు ఏమైనా అవసరం ఉన్న పోలీస్ అధికారులకు లేదా డైల్ 100కు గాని సంప్రదించవచ్చు అని బందోబస్త్‌లో పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించి తమకు ఇచ్చిన ఏరియాలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా గ్రూప్ -1 పరీక్షల బందోబస్త్‌లో పాల్గొనాలని, ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లు అయితే వెంటనే ఉన్నత అధికారులకు తెలియజేయాలని బందోబస్త్ విధులతో నిర్లక్ష్యం వహిస్తే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. పరీక్షలకు హాజరు అయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా గ్రూప్ -1 పరీక్ష నియమా నిబంధనలు పాటించాలని ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షకు హాజరై తమ కలలను సాకారం చేసుకోవాలని గ్రూప్ -1 పరీక్ష రాసే ప్రతి ఒక్కరికి బెస్ట్ ఆఫ్ లక్ అని తెలిపారు.

# నేడు పూడూరు మండలంలో డిసిసి అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పర్యటన

**పూడూరు, జూన్ 10. ప్రభాతవార్త :**
ఈ నెల 11వతేదీన పూడూరు మండలంలో వికారాబాద్ జిల్లా డిసిసి అద్యక్షుడు, పరిగి మాజీ ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పర్యటిస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షుడు, ఎన్కెపల్లి ఎంపిటిసి సురేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టిపిసిసి అద్వర్యలంలో సరూర్‌నగర్‌లో ప్రియాంకగాంధీ పొందు పరిచిన హైద్రాబాద్ యూత్ డిక్లరేషన్ స్పూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొల్పే లక్ష్యంతో జూన్ 18వతేదీన నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్‌లో యువత పాల్గొనాలని పిలుపునిస్తూ గ్రామాల పర్యటన ఉన్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారభమయ్యే ఈ కార్యక్రమం మండలంలోని ఎన్కెపల్లి, మన్నెగూడ, మీర్జాపూర్, బాకాపూర్, పూడూరు, అంగడి చిట్టంపల్లి, చెన్‌గోముల్, రేగడి మామిడిపల్లి గ్రామాల మీదుగా కొనసాగుతుందని ఇట్టి కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# సుపరిపాలనతో రాష్ట్రంలో స్వర్ణయుగం

**- విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి - రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాలు**



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి.



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10, (ప్రభాతవార్త) :**
గత కొన్ని సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు మరోసారి గుర్తు చేసుకోవడానికే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను 21వ రోజుల పాటు నిర్వహించుకోవడం జరుగుతుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖ అధికారులనుద్దేశించి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడారు... ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారని, బడుగు బలహీన వర్గాల కోసం అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో సుపరిపాలనలో స్వర్ణయుగం కొనసాగుతుందని దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆమె ప్రతి ఒక్కరి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం ఏర్పాడిన తరువాత ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు రాష్ట్ర పరిపాలనను పూర్తిగా మార్చివేశారని ఆమె గుర్తు చేశారు. ప్రభుత్వ పరిపాలనను ప్రజలకు మరింత దగ్గర చేయడానికి అనేక సంస్కరణలు తీసుకొచ్చారని ఆమె పేర్కొన్నారు. 2016 అక్టోంబర్ ముందు తెలంగాణలో పది జిల్లాలే ఉండగా పునర్విభజన అనంతరం కొత్తగా ప్రజలకు అందుబాటులో అనేక జిల్లాలను ఏర్పాటు చేయడం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వికారాబాద్, మేడ్చల్ జిల్లాలను కొత్తగా ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, గతంలో జిల్లా కార్యాలయాలకు వెళ్లాలంటే 200 నుంచి 250 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి వచ్చేదని, ప్రస్తుతం 60, 70 కిలోమీటర్ల దూరంలోనే ఉండేవిధంగా అందుబాటులోకి వచ్చాయని మంత్రి పేర్కొన్నారు. కొత్త కలెక్టరేట్ వల్ల పరిపాలన సౌలభ్యం కూడా పెరిగిందని, ప్రజలకు ఆయా శాఖల ద్వార సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం అవుతున్నాయని ఆమె పేర్కొన్నారు. గతంలో రంగారెడ్డి జిల్లాలోని వివిధ శాఖల కార్యాలయాలు ఎక్కడో దూరంగా ఉండేవని ప్రస్తుతం అన్ని కార్యాలయాలు సమీకృత కార్యాలయంలోకి రావడం జరిగిందన్నారు. ఆయా డివిజన్లు, జిల్లా కార్యాలయాలు అన్ని ఒకే చోటుకి తరలి వస్తున్నాయన్నారు. వికేంద్రీకరణతో ప్రజల వద్దకు పాలన తీసుకు వచ్చి నూతన జిల్లాలు, డివిజన్లు, మండలాలు, గ్రామపంచాయతీలు, పోలీస్‌స్టేషన్లు, కమీషనరేట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికార వికేంద్రీకరణతో అధికారుల మీద ఒత్తిడి తగ్గిందని, పారదర్శకత పెరిగిందని, పనులు సులువుగా అవుతున్నాయన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు ఇన్నోవా వాహనాలు, నిధులు కేటాయింపు, షీ టీమ్‌ల ఏర్పాటు చేసి ఫ్రెండ్లీ పోలీస్ వాతావరణం కల్పించిందని అన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి ద్వారా సౌకర్యాలు ఏర్పాడ్డాయని, ప్రజలు గ్రామాలలో ఉండటానికి మొగ్గు చూపుతున్నారని, ఇదే తెలంగాణ సాధించిన ప్రగతికి గీటురాయని అన్నారు. నాడు నిర్లక్ష్యానికి గురైన వ్యవసాయ శాఖ నేడు ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతతో అన్ని రంగాల కన్నా ముందుందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం అనువైన వాతావరణం కల్పించటంతో వెల్లువలా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలుస్తుందన్నారు. 3116 రూపాయలు ఉన్న దివ్యాంగుల పెన్షన్ ను 4116కు పెంచిన ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కలెక్టర్ హరీష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని రంగాలను ఎంచుకొని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం జరుగుచున్నదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత పరిపాలన సౌలభ్యం సులభతరం అయిందని త్వరితగతిన ప్రజలకు సేవలందించేందుకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పించిందన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం రంగారెడ్డి జిల్లాలో 27 మండలాలు ఐదు రెవెన్యూ డివిజన్లు, 13 మున్సిపాలిటీలు, మూడు మున్సిపల్ కార్పోరేషన్‌లను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని అన్ని హంగులతో ఆధునాతన సదుపాయాలతో కొంగరకలాన్ గ్రామం ఇబ్రహీంపట్నం మండలంలో 35 ఎకరాల విస్తీర్ణంలో 58 కోట్ల 20 లక్షలతో నిర్మాణం చేసుకొని గత సంవత్సరం ఆగస్టు 28న గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసుకొని జిల్లా పరిపాలన కొనసాగిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలుపరుస్తుందన్నారు. భూ సమస్యల పరిష్కారం, వ్యవసాయం, సాగు, త్రాగునీటి, వైద్య ఆరోగ్య, ప్రతి శాఖలో అనేక సంస్కరణలు చేపట్టి ప్రజలకు సులభంగా సేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈ సుపరిపాలన మరింత వేగంగా ప్రజలకు సేవలు అందించాలని కోరుకుంటున్నని అన్నారు. అదేవిధంగా పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పల్లెలను, పట్టణాలను అభివృద్ధి చేసుకుంటు పరిశుభ్రంగా ఉండేట్లు చేసుకున్నామని అన్నారు. పల్లెల్లో వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, మరుగుదొడ్లు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ అనిత హరినాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, అదనపు కలెక్టర్లు ప్రతీక్ జైన్, తిరుపతి రావు, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఆర్డీఓ వెంకటాచారి, పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధికార పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకునే చిత్తశుద్ధి లేదా?

**- వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.డి.ఇబ్రహీం**

**- లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును నిర్మించకుండా బీఆర్ఎస్ కాలయాపన చేస్తుంది**



దీక్షలు చేస్తున్న వైఎస్సార్ టీపీ పార్టీ నాయకులు, తదితరులు

**షాద్‌నగర్, జూన్ 10, (ప్రభాతవార్త) :**
షాద్‌నగర్ ప్రాంత ప్రజలకు గత ఎన్నికల సమయంలో అధికార బీఆర్ఎస్ పార్టీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును నిర్మిస్తామని హామీ ఇచ్చి ఓట్లు దండుకుంది కాని, నేటికి ఆ హామీని నిలబెట్టుకోవాలన్న చిత్తశుద్ది లేదా అని వైఎస్సార్ టీపీ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.డి.ఇబ్రహీం ప్రశ్నించారు. షాద్‌నగర్ నియోజకవర్గం చౌదరిగూడ మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులను వెంటనే చేపట్టాలని ప్రజా సంఘాలు, ప్రతిపక్షాల ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణ ముందు చేపట్టిన రిలే నిరహార దీక్షలు శనివారానికి 9వ రోజుకు చేరుకున్నాయి. శనివారం చేపట్టిన రిలే దీక్షల్లో వైఎస్సార్ టీపీ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.డి.ఇబ్రహీం ఆధ్వర్యంలో వైఎస్సార్ టీపీ పార్టీ నాయకులు, నవ తెలంగాణ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు తుప్పుడు నర్సయ్యలు కూర్చున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ టీపీ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.డి.ఇబ్రహీం మాట్లాడుతూ... షాద్‌నగర్, చుట్టుపక్కల నియోజకవర్గాలకు ఎంతో ప్రాణదాయకమైన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును అధికార పార్టీ చేపట్టకుండా కాలయాపన చేస్తుందని ఆయన మండి పడ్డారు. గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి నేటికి నిర్మించకపోవడం సిగ్గుచేట్టని ఆయన మండి పడ్డారు. ఇకనైనా అధికార పార్టీకి చిత్తశుద్ధి ఉంటే లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును నిర్మించేంత వరకు తమ ఉద్యమం ఆగదని, ప్రజా సంఘాలు, ప్రతిపక్షా పార్టీలు ఏకమై ప్రజల తరుపున అధికార పార్టీని నిలదీస్తునే ఉంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీపీ పార్టీ నందిగామ మండల అధ్యక్షుడు నర్సింహ్మా, కేశంపేట మండల పార్టీ అధ్యక్షుడు మనసాని రాంరెడ్డి, షాద్‌నగర్ టౌన్ అధ్యక్షుడు డేవిడ్ రాజు, పార్టీ నాయకులు సుదర్శన్, బషీర్, జాఫర్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి

**- ఉపాధ్యాయులకు బదిలీలు పదోన్నతులు చేపట్టాలి**

**- టీఎస్‌యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా**



సమావేశానికి హాజరైన టీఎస్‌యూటీఎఫ్ నాయకులు.

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10, (ప్రభాతవార్త) :**
తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం కె.గోపాల్ నాయక్ జిల్లా అధ్యక్షుడు అధ్యక్షతన టీఎస్‌యూటీఎఫ్ భవనం నందు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సందర్భంగా పాఠశాలలు బాగా నడవాలంటే పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలి. దాని కోసం పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. మన ఊరు మన బడి కార్యక్రమాన్ని వేగవంతం చేసి అన్ని పాఠశాలలకు విస్తరించి, మౌళిక సదుపాయలు కల్పించాలని, హైస్కూల్స్‌లో సబ్జెక్టు టీచర్ల కొరతను తగ్గించడానికి ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని, బదిలీలు కూడా చేపట్టాలని, సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ పథకం పునరుద్దరించాలని, రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూల్‌లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్ కార్డు ఇవ్వాలని, కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు బేసిక్ పే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ నిర్వహిస్తున్న బడి బాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొని విద్యార్థుల నమోదు పెంచుతున్న సందర్భంగా వారికి ఈఎల్ఎస్ ఇవ్వాలని కోరారు. తెలంగాణకు దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా జూన్ 20న నిర్వహిస్తున్న విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలల మనుగడ కోసం డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలని, పర్యవేక్షణ అధికారులైన డీఈఓ, ఎంఈఓ, డీప్యూటీ ఈఓ పోస్టులను వెంటనే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జూలై 1 నుంచి కొత్త పీఆర్సీ వర్తింపజేయాలని దాని కంటే ముందే పెండింగ్‌లో ఉన్న 3 డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఈ.గాలయ్య ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటప్ప, ఉపాధ్యక్షులు బి.రాములయ్య, ఎన్.కల్పన, కోశాధికారి పి.జగన్నాథ్‌శర్మ, జిల్లా కార్యదర్శులు నాగేంద్రం, వెంకటయ్య, భగవత్ రాజ్, శివారెడ్డి, బుగ్గరాములు, కె.కిషన్‌చాహన్, భువనేశ్వరి, శ్యామలదేవి తదితరులు పాల్గొన్నారు.

# పత్తాలేని మండల సర్వేయర్

**-నెలలు గడుస్తున్నా సర్వే చేయడం లేదు**
**-కుప్పలు తెప్పలుగా సర్వే కోసం దరఖాస్తులు**
**-తహసిల్దార్ కార్యాలయం ముందు రైతుల ఆందోళన**



పెద్దేముల్ తహసిల్దార్ కార్యాలయం ముందు రైతుల ఆందోళన

**పెద్దేముల్, జూన్ 10, ప్రభాతవార్త:**
పెద్దేముల్ మండల సర్వేయర్ కార్యాలయానికి ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళతారో ఎవరికి అంతుచిక్కడంలేదని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇంతవరకు కనీసం సర్వేయర్ ఎవరో ఎలా ఉంటాడో కూడా తమకు తెలియడంలేదని వాపోతున్నారు. దరఖాస్తు చేసుకొని నెలలు గడుస్తున్న ఇంతవరకు సర్వేచేయకపోవడంలో ఆంతర్యమేమిటోనని ఆయా గ్రామాల రైతులు ప్రశ్నిస్తున్నారు. సర్వే కోసం కుప్పలు తెప్పలుగా ధరఖాస్తులు వచ్చిన వాటిని పట్టించుకునేనాథుడేలేరని మండి పడుతున్నారు. పెద్దేముల్ మండలంలోని గాజీపూర్ గ్రామానికి చెందిన కుడుగుంట బాలప్పకు 40 సంవత్సరాల క్రితం బుద్దారం శివారులోని సర్వేనెంబర్ 110లో 4 ఎకరాల 16 గుంటల భూమిని ప్రభుత్వం అందజేసింది. అయితే అట్టి భూమిలో గ్రామానికి చెందిన కొందరు అక్రమణ చేసారని, అందుకు తనకు ఉన్న భూమిని తనకు చూపించాలని అట్టి సర్వేనెంబర్‌పై కోర్టులో కేసువేసాడు, ఇందుకు అట్టి సర్వే నెంబర్‌లో గల ఇతర రైతులు నారాయణ, బసప్ప, రాములు, మాడమ్మ, మాణెమ్మ, నర్సిములు, శ్రీను, వెంకట్‌రెడ్డి, బాలప్ప, రాంచెంద్రయ్య తదితరులకు నోటీసులు వచ్చాయి. దీంతో ఆందోళన చెందిన రైతులు తాము కూడా కష్టపడి భూములను సంపాదించుకున్నామని తమ భూములు కూడా ఎక్కడున్నాయో సర్వేచేసి చూపించాలని దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులు చేసుకొని నెలలు గడుస్తున్న ఇంతవరకు సర్వే చేయకపోవడంతో శనివారం మండల తహసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. నెలల తరబడి తహసిల్దార్ కార్యాలయం చుట్టు కాలయాపన చేసిన తమను పట్టించుకునేనాథుడేలేరని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము దరఖాస్తు చేసుకున్న తమ భూములను ఎందుకు సర్వే చేయడం లేదని సర్వేయర్‌కు ఫోన్‌చేయగా, అంత అత్యసవరముంటే ప్రైవేటు సర్వే చేసుకొండని చెబుతున్నాడని అన్నారు. తమ భూములను సర్వే చేసి తమకు న్యాయం చేసే విధంగా చూడాలని, లేనిచో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

# భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లులు...గ్రామ దేవతలు

**-మొదళ్ళగూడలో గ్రామదేవతల విగ్రహాప్రతిష్ఠలో మాజీ ఎమ్మెల్యే**



మొదళ్ళగూడెంలో జరిగిన వేడుకల్లో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి తదితరులు

**నందిగామ జూన్10, ప్రభాతవార్త :**
కొలిచే భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లులు గ్రామదేవతలని, ఆదేవతలను కొలిచే భక్త జనులు ఆరోగ్యంతో ,ఐశ్వర్యంతో, సుఖసంతోషాలతో విల్లసిల్లుతారని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. శనివారం నందిగామ మండలం మొదళ్లగూడెం గ్రామంలో ఉమ్మడి మండలాల మాజీ జడ్పీవైస్ చైర్మన్ ఎన్.నవీన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బోద్రాయి మరియు మైసమ్మ, పోచమ్మ గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవచ్చుకోవాలని, పూజలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే ధర్మ మార్గం సిద్ధిస్తుందన్నారు. వేద బ్రాహ్మణ మంత్రోచ్చరణల మధ్య కనుల పండువగా సాగిన ఈ విగ్రహా ప్రతిష్ఠాపన వేడుకలో బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి, బిఎస్పీ ,టిడిపి పార్టీలకు చెందిన రాజకీయ ప్రముఖులు, అధికారు లు హాజరై పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మొదళ్లగుడెం సర్పంచ్ ఎన్ ఉమాప్రవీణ్ రెడ్డి, దంపదులు ,మాజీ సర్పంచ్ ఎన్.శోభా, వెంకట్ రాంరెడ్డి దంపతులు, ఎన్.లక్ష్మి నవీన్ రెడ్డి దంపతులు, మాజీ ఎంపిపి ఎం.శివశంకర్ గౌడ్, ఉమ్మడి మండలాల మాజీ ఎంపిపి జె.వేణుగోపాల్ గౌడ్, మాజీ జడ్పీటిసి మామిడి శ్యాం సుందర్ రెడ్డి, బిజెపి నాయకులు శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, నవీన్ రెడ్డి, యువ సేన సభ్యులు, రమేష్ గౌడ్, గణేష్, రఘు, శ్రీకాంత్, ఎంపిటిసి కాట్న మాధవి, రవిందర్, మామిడిపల్లి ఉపసర్పంచ్ హన్మంత్ రెడ్డి, సత్యనారాయణ ,ఉమ్మడి మండలాల నుండి హాజరైన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ఆయా శాఖల అధికారులు ఆయా పార్టీల కార్యకర్తల పాల్గొన్నారు.

# కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 10, ప్రభాతవార్త:**
కడుపునొప్పి భరించలేక ఫినాయిల్ తాగి మహిళ మృతి చెందిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సంఘటన వివరాలు పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ సీఐ అశోక్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పోచారం మున్సిపల్ అన్నోజిగూడ రాజీవ్ గృహ కల్ప కాలనీలో సోమని జయమ్మ ( 55 ) కొడుకు రమేశ్‌తో కలిసి నివాసం ఉంటుంది. మృతురాలు జయమ్మ గత పది సంవత్సరాలుగా కడుపునొప్పితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంది. పలుమార్లు పలు ఆస్పత్రుల చుట్టూ తిరిగి వైద్యసేవలు పొందిన కడుపు నొప్పి తగ్గలేదు. దీంతో కడుపునొప్పి భరించలేక ఈ నెల 9 వ తేదిన కొడుకుతో కలిసి కిరాణ జనరల్ స్టోర్‌కు వెళ్లి సరుకులతో పాటు ఫినాయిల్ తెచ్చుకుని ఇంట్లో సేవించింది. మృతురాలు జయమ్మ నోట్లో నుండి నురగలు కక్కుతూ స్పృహతప్పి పడిపోగా కొడుకు రమేశ్ చికిత్స నిమిత్తం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి 108 అంబులెన్స్‌లో తీసుకెళ్లాడు. ప్రాథమిక చికిత్స అనంతరం ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రి నుండి బాధితురాలిని మెరుగైన చికిత్స కొరకు నగరంలోని గాంధీ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గాంధీలో చికిత్స పొందుతూ బాధితురాలు జయమ్మ మృతి చెందినట్లు శనివారం డాక్టర్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీసీ సీఐ అశోక్ రెడ్డి తెలిపారు.

# ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల్లో ఉండాలి

**-బాధ్యతతో సేవలు అందించాలి : మంత్రి మల్లారెడ్డి**

**-కలెక్టరేట్‌లో జరిగిన సుపరిపాలన దినోత్సవం**



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి, పాల్గొన్న జడ్పీచైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి, కలెక్టర్ అమోయ్‌కుమార్, అదనపు కలెక్టర్లు, డిసిపి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి జూన్ 10, ప్రభాతవార్త**
ప్రజలకు సేవలు అందించే బాధ్యత ప్రజాప్రతినిధుల, అధికారులపై ఉందని, సుపరిపాల సౌలభ్యం కోసమే కొత్త కలెక్టరేట్ భవనాలను ప్రభుత్వం నిర్మించిందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సిహెచ్ మల్లారెడ్డి పేర్కొన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సుపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో జడ్పీచైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగ పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కొత్త కలెక్టరేట్ ఏర్పాటుతోనే సుపరిపాలన సాధ్యమవుతుందన్నారు. ప్రజలకు సేవలు చేసే భాగ్యం లభించటం ప్రజా ప్రతినిధులు అధృష్టంగ భావించాలన్నారు. జిల్లాల పునర్విభజనతో ప్రజలకు కొత్త కలెక్టరేట్లు, కొత్త మండలాలు, కొత్త గ్రామపంచాయతీలు కొన్ని ఏర్పడి ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లు వివరించారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలోనే జిల్లా కలెక్టరేట్ ఉండటం, నూతన భవనం నిర్మాణం జరిగి అన్ని కార్యాలయాలు ఒకే చోట అందుబాటులోకి రావటంతో పరిపాలన సౌలభ్యంగ మారిందన్నారు. సిఎం కెసిఆర్ ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండ ఉండటానికి అందుబాటులోకి ప్రభుత్వ కార్యాలయాలు ఉండాలన్న లక్ష్యంతో సుపరిపాలన అందించాలన్న కృషితోనే కొత్త కలెక్టరేట్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాగ నూతనంగ ఏర్పాటు చేశాక ప్రజలకు అందుబాటులో కార్యాలయాలు, పరిపాలన సౌలభ్యంతో పాటు అభివృద్ధిలో కూడ అన్ని రంగాల్లో రాణిస్తుందని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంతో పాటు జిల్లా కూడ అన్ని రంగాల్లోనూ మేడ్చల్ జిల్లా నెంబర్‌వన్‌గా రాణిస్తుందన్నారు. గ్రామపంచాయతీల్లో, మున్సిపాల్టీల్లో, మున్సిపల్ కార్పోరేషన్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించటం జరిగిందన్నారు. సిఎం కెసిఆర్ దత్తత తీసుకున్న (5)గ్రామాల్లోనూ 69కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు జరిగినట్లు తెలిపారు. గ్రామాల్లో, పట్టణాల్లోనూ నర్సరీలు, వైకుంఠదామాలు, డంపింగ్‌యార్డులు ఏర్పాటు, ట్రాక్టర్లు ఏర్పాటు జరిగినట్లు తెలిపారు. పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలో 14కొత్త గ్రామపంచాయతీలు, జిల్లాలో మొత్తం 61గ్రామపంచాయతీలు 9మున్సిపాల్టీలు, 4మున్సిపల్ కార్పోరేషన్లు, 5మండలాలు ఉండి గణనీయమని అభివృద్దిని సాధిస్తున్నట్లు మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలోనే సుమారు 440మంది వరకు ప్రజాప్రతినిధులు స్థానికసంస్థలతో ఉండటం రాష్ట్రంలోనే మేడ్చల్ నియోజకవర్గం చారిత్రాత్మకమన్నారు. పోలీసుశాఖలోనూ తెలంగాణ వచ్చాక సౌకర్యాలు పెరిగాయని అన్నారు. అభివృద్దిలో, సంక్షేమ పథకాల అమలులో ముందులో ఉన్నామని మంత్రి అన్నారు. జడ్పీచైర్మన్ ఎం.శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటు చేయటం వల్లనే మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు జిల్లా పరిషత్ ఏర్పాటు జరిగి ప్రజలకు సేవలు అందించే భాగ్యం లభించిందన్నారు. జిల్లాలో కార్యాలయాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చినట్లు వివరించారు. జడ్పీనిధులతో గ్రామాల అభివృద్దికి కృషి జరుగుతుందన్నారు. గ్రామపంచాయతీల్లోనూ సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్, అదనపు కలెక్టర్లు నర్సింహ్మారెడ్డి, అభిషేక్ ఆగస్త్య, జడ్పీసిఇఓ దేవసహాయం, డిసిపి జానకి, కలెక్టరేట్ ఎఓ వెంకటేశ్వర్లు, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి, మున్సిపల్ మేయర్లు వెంకట్‌రెడ్డి, కావ్య, చైర్మన్లు కొండల్‌రెడ్డి, మరి కొందరు, ఎంపిపిలు డి.ఎల్లుబాయిబాబు, మరి కొందరు, జడ్పీటిసిలు ఎం.అనితలాలయ్య, మరి కొందరు, కోఆప్షన్‌సభ్యులు జహీర్, మరి కొందరు, సర్పంచులు, ఎంపిటిసిలు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సుపరిపాలన

## ప్రజలకు చెరువగా సిఎం కెసిఆర్ పాలన

**-తెలంగాణ సుపరిపాలన దినోత్సవంలో జడ్పివైస్ చైర్మన్**



తెలంగాణ సుపరిపాలన దినోత్సవంలో మాట్లాడుతున్న ఎంపిపి ప్రియాంక

**నందిగామ జూన్10,ప్రభాతవార్త :**
ప్రజలకు చెరువులో సుపరిపాలన అందిస్తూ,రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న సంక్షేమ పథకాల స్ఫూర్తిప్రధాత సిఎం కెసిఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్ ఎంపిపి ఎం.ప్రియాంక,డిసిసిబి డైరెక్టర్ కంకంటి మంజులారెడ్డిలు స్పష్టం చేశారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం జడ్పిహైస్కూల్‌లో సమావేశమందిరంలో జరిగిన తెలంగాణ సుపారిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని వారు మాట్లాడుతూ...గడిచిన తోమ్మిదేళ్ల కాలంలో జరిగిన పరిపాలన సంస్కరణలు,వాటి ఫలితాలపై సంతృప్తి, వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎం.మంజుల,ఎంపిడివో బాల్ రెడ్డి,ఎంపిఓ గిరిరాజ్, ఎంపిటిసి రాజు నాయక్,సర్పంచ్‌లు ఎనుగోండ రమేష్ గౌడ్,జెట్ట కుమార్,గోవింద్ ,ఎంపిటిసి చంద్రాపాల్ రెడ్డి,నా యకులు ఎండి బెగ్, చిందం నర్సింలు,ఆయా శాఖల అధికారులు ,పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

**-కడ్తాల్ సర్పంచ్ గూడూరు లక్ష్మినరసింహారెడ్డి**



సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న సర్పంచ్ లక్ష్మినరసింహారెడ్డి

**కడ్తాల్,జూన్ 10 ప్రభాతవార్త :**
కడ్తాల్ మండలం హన్మాస్పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో కొలువైయున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయములో కడ్తాల్ గ్రామ నివాసి కమ్లికార్ వెంకటేష్, భక్తబృందం ఆధ్వర్యంలో రెండవ శనివారంను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఆంజనేయస్వామి అభిషేకం, సత్యనారాయణస్వామి వ్రతంలో కడ్తాల్ సర్పంచ్ గూడూరు లక్ష్మినరసింహారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని, భక్తి మార్గంలో నడవాలని సూచించారు. అదేవిధంగా దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలని, తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలోసైతం గుర్తింపు పొందిన దేవాలయాలకు దూప,దీప నైవేద్యం పథకం ద్వారా ఆరువేల రూపాయలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శంకర్, మా ర్కెట్ డైరెక్టర్ లాయక్ అలీ,పర్వతాలు,రాజాగౌడ్,కృష్ణయ్య,సుధీర్‌రెడ్డి, యాదయ్య, కేశవులు, భరత్, రాఘవేందర్, శ్రీను మహిళలు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేక...నిందలు మోపుతున్నారు



తండా వాసులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హాఫీజ్

**జిల్లెడు చౌదరిగూడ, జూన్ 10,(ప్రభాతవార్త):**
తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు లేని పోని నిందలు మోపుతున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్ అన్నారు. శనివారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని కాస్లాబాద్ తాండను ఆయన విలెకరులతో కలిసి పర్యటించారు. తాండాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయమంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని వచ్చిన ఆరోపనలపై ఆయన స్పందించారు. కాంగ్రెస్ నాయకులు ఆరోపనలలో ఎలాంటి వాస్తవం లేదని ఆయన నిరుపించారు. తాండాల అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద పీఠ వేస్తుందని ఆయన పెర్కొన్నారు. అలాంటి తండాలపై ఆరోపనలు చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. కాంగ్రెస్ హాయమంలో చేయలేని పనులు ప్రస్తుతం జరుతుండడం వారు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎసిఎస్ డైరెక్టర్ జబ్బార్, సర్పంచ్‌లు వెంకటస్వామి, గోపాల్, శివమౌళి, బాల్‌రాజు, నాయకులు మోత్యానాయక్, జహంగీర్, సోమేష్, నరేష్, గణెష్, బంద్య, సోమ్లా, తదితరులు ఉన్నారు.

## పారిశుధ్య కార్మికులను సన్మానించిన చైర్‌పర్సన్



పారిశుద ్య కార్మికులను సన్మానిస్తున్న చైర్‌పర్సన్

**కొత్తూర్, జూన్ 10, ప్రభాతవార్త :**
పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం పారిశుద్ధ్య దినోత్సవ సందర్భంగా కొత్తూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్‌కి సంబంధించిన వాహనాలను పూలు, పచ్చని తోరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.... పురపాలక సంఘంలోని పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం, పారిశుద్ధ్య దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చావైనా.... పండుగ అయినా.... ఆఖరికి కరోనా మహమ్మారి విజృంభించిన నిరంతరం ప్రజాసేవలో తరలించారన్నారు. ఈసందర్భంగా పాలకవర్గ సభ్యులు, అధికారులు పారిశుద ్య కార్మికులను సతా ్కరించారు. ఈకార్యక్రమంలో కమిషనర్ వీరేందర్, వైస్ చైర్మెన్ రవీందర్, కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, హేమదేవేందర్‌ముదిరాజ్, జయమ్మజనార్ధన్‌చారి, ప్రసన్నలతయాదయ్య, ఎంపీటీసీ రాజేందర్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

**షాబాద్, జూన్ 10, ప్రభాతవార్త :**
షాబాద్ మండల పరిధిలోని దామర్లపల్లిలో రోజురోజుకు కుక్కల బెడద ఎక్కువ అయిపోయింది. శనివారం దామర్లపల్లి గ్రామంలో ఇద్దరు బాలులపై కుక్క దాడి చేసింది. మేడిబాయ్ బల వ్యంత్‌రెడ్డి కూతురు అక్షయపైన కమ్మరి ధనుంజయచారి కుమారుడు శ్రీనివాస్‌పైన దాడి చేశాయి. చందన్‌వెల్లి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసుకుని అనంతరం నగరంలోని కోరింటి ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా ఇంతకు ముందు వారం రోజుల క్రితం వడ్ల చిన్నయ్యపైన దాడి చేయడం కూడా జరిగింది. నాలుగు రోజుల క్రితం కర్రీ బుచ్చయ్య కొడుకుపైన కూడా దాడి చేయడం జరిగింది. తక్షణమే కుక్కల బెడద నుంచి రక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సువరిపాలన దినోత్సవంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పావనియాదవ్

**ఘట్‌కేసర్ పురపాలక సంఘం కారా ్యలయంలో**

**ఘట్‌కేసర్, జూన్ 10, ప్రభాతవార్త:** ప్రజలకు పారదర్శకమైన పరిపాలన అందిస్తూ ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించామని మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. పురపాలక సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ పావనియాదవ్, కమీషనర్ వేమనరెడ్డిలు అధికారులు, సిబ్బందితో మున్సిపల్ పరిపాలనపై చర్చించారు. మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత అందరి సహకారంతో 2 సార్లు జాతీయ స్థాయిలో స్వచ్ఛసర్వేక్షన్ అవార్డు పొందామని తెలిపారు. పట్టణంలో గడిచిన మూడున్నర సంవత ్సరాల కాలంలో మున్సిపల్‌లోని 18 వార్డుల ప్రజలకు అవసరమైన బిటి రోడ్లు, సిసి రోడ్లు, భూగర్భడ్రైనేజీ, వీధిదీపాలు ఇతర అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. కోవిడ్ సమయంలో కూడా పట్టణంలో పనులు జరిగాయని, పారిశుద్ధ్య కార్మికులు అందించిన సేవలు మరువలేనివన్నారు. రాబోయే ఏడాదిన్నర కాలంలో పట్టణ ప్రజలకు ఇంకా అవసరమైన సదుపాయాలు కల్పించి స్వచ్ఛ ఘట్‌కేసర్‌గా అభివృద్ధి చేసేందుకు పరిపాలన వ్యవస్థను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు, నిర్మాణాలు, ప్రజలకు దృవపత్రాలు జారీ చేసే విషయంలో అధికారులు, సిబ్బంది పూర్తి పారదర్శకత పాటించాలని వారు సూచించారు. ఈసమావేశంలో కౌన్సిలర్లు బొక్క సంగీత, కడుపొల్ల మల్లేశ్, మేనేజర్ మర్రి అంజిరెడ్డి, స్వచ్ఛసర్వేక్షన్ ఇంచార్జ్ యోగేశ్, పర్యావరణ ఇంచార్జ్ రాజేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, బిల్‌కలెక్టర్లు, కార్మికులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి

**గుండ్లపోచంపల్లి మున్సిపాలిటిలో..**

**మేడ్చల్, జూన్ 10. ప్రభాతవార్త :** ప్రజా అవసరాల మేరకు మౌళిక వసతులు కల్పించి, ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించే విదంగా పాలనను అందిస్తున్నామని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటిలో సుపరిపాలన దినోత్సవాన్ని చైర్మన్ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో కనీస అవసరాలైన సీసీ రోడ్డు, అంతర్గత మురికి కాలువల నిర్మాణంతో పాటు నీటి సరఫరా, వీది దీపాల ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎలాంటి సమస్య ఉన్న పాలకవర్గ సభ్యులందరమూ కలిసి పరిష్కారం చేపడుతున్నామని అన్నారు. అదే విదంగా ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాములు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

# మత్స్యకారులు చెరువులను,వృత్తిని కాపాడుకోవాలి

**-జీవితాల్లో మార్పులు రావాలి..ఆర్థికంగ ఎదగాలి**

**-రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్**

**-శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద ముగిసిన మూడు రోజు ఫిష్ ఫెస్టివల్**



శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద ఫిష్ ఫెస్టివల్ ముగింపు సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్,పాల్గొన్న జిల్లా మత్స్య శాఖ అధికారి బి.పూర్ణిమ, పలువురు మత్స్య సంఘాల సభ్యులు

**శామీర్‌పేట,(మేడ్చల్ జిల్లా ప్రతినిధి) జూన్ 10, ప్రభాతవార్త**
మత్స్యకారులు తమ జీవితాలు బాగుపడటానికి చెరువులను, తమ వృత్తిని కాపాడుకోవాలని, మరింత ఆర్థికంగ ఎదగాలని రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ సూచించారు. శనివారం సాయంత్రం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట పెద్దచెరువు వద్ద ఫిష్ ఫెస్టివల్ (చేపల ఆహార వంటకాల ఉత్పత్తి) ముగింపు కార్యక్రమం జరిగింది. దీనికి రాష్ట్ర ఫిష్ (మత్స్య) ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ విచ్చేయటంతో జిల్లా అధికారి బి.పూర్ణిమతో పాటు జిల్లాలోని వివిధ మత్స్యసంఘాల వారు, మహిళా మత్స్యసంఘాల సభ్యులు చైర్మన్‌ను కలిసి సన్మానించారు. జిల్లా మత్స్య శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేపల ఆహార ఉత్పత్తి వంటకాల తయారు కోసం మత్స్యకారులు సంఘాల వారు, మహిళా సంఘాల వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి పరిశీలించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద ఫిష్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగ రాష్ట్ర చైర్మన్ పిట్టల రవీందర్ మాట్లాడుతూ మత్సకారులు చెరువులను కాపాడటంతో పాటు వృత్తి నిర్వాహణలో జీవితాల్లో మార్పులు తెచ్చుకోవాలని సూచించారు. చెరువులు ఉంటేనే మత్స్యకారులకు ఉపాధి అని, బతుకుదెరువు అని అన్నారు. మత్స్యకారుల వృత్తి మహాగొప్పదని అన్నారు. రోగాల నివారణకు చేపలు ఆహారంగ తీసుకోవటం మంచిదని 18రకాల రోగాలను నయం చేస్తుందన్నారు. మత్సకారులకు తెలంగాణ ప్రభుత్వం అండగ ఉంటుందని, మత్స్యకార సంఘాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చెరువుల, చేపల పెంపకంపై దృష్టిని పెట్టాలని మత్స్యకారులు ఆర్థికంగ ఎదగాలని అన్నారు. గ్రామాల్లో చేపల షాపులను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. చికెన్,మటన్ షాపుల తరహాల్లో చేపల షాపులు కూడ మత్స్యకారులు ఏర్పాటు చేయాలన్నారు. చేపల వినియోగాన్ని పెంచాలని ఆయన సూచించారు. చేపలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని అన్నారు. మత్స్యకారుల సమస్యలు ఉంటే పరిష్కరించటానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, తన దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తానని చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. మత్స్యకారుల సభ్యత్వ నమోదు విషయంలోనూ కొందరు ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తుందని, సభ్యులుగా చేరాలని వృత్తిలో రాణించాలని ఆర్థికంగ ఎదగాలని చైర్మన్ పిట్టల రవీందర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్య శాఖ అధికారి బి.పూర్ణిమ, పలువురు అధికారులు,సిబ్బంది, మత్స్యకారులు వివిధ గ్రామాల సంఘాల సభ్యులు జంగయ్య, కృష్ణ, సంధ్య, ఫణిరాజ్, రేణుక, శ్రీనివాస్, శాంతమ్మ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## కొర్రెముల ఉచిత వైద్య శిబిరంలో 400 మందికి వైద్యసేవలు

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 10, ప్రభాతవార్త:**
మండలంలోని కొర్రెముల గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో దాదాపు 400 మందికి వైద్యసేవలు అందించినట్లు క్యాంపు నిర్వహకులు శిగ వినయ్‌కుమార్ తెలిపారు. నగరంలోని నాగోల్ సుప్రజ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో రోగులకు షుగర్, బీపీ, ఎముకలు, గుండె తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్ గౌడ్, ఎంపీటీసీ బోడ్డు వినోదనాగార్జున, ఆస్పత్రి ఎండీ శిగ విజయ్‌కుమార్, విక్రం గౌడ్, మేనేజర్ సరిత పాల్గొన్నారు.

## ఘనంగా రాతి ధ్వజస్థంభ ప్రతిష్ఠాపన పూజలు



అన్నోజిగూడ శ్రీ గాయత్రీ దేవాలయ రాతి ధ్వజస్థంభ కార్యక్రమానికి హాజరైన చైర్మన్ కొండల్ రెడ్డి తదితరులు.

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 10, ప్రభాతవార్త:**
పోచారం మున్సిపల్ అన్నోజిగూడలోని శ్రీ గాయత్రి దేవాలయంలో శనివారం జరిగిన రాతి ధ్వంజ స్థంభ ప్రతిష్ఠాపన పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్మన్ బి. కొండల్ రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. రాతి ధ్వజస్థంభ ప్రతిష్టాపన పూజలకు శ్రీ మాధవానంద సరస్వతి స్వామి యంత్ర ప్రతిష్టపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కౌన్సిలర్ సింగిరెడ్డి సాయిరెడ్డి, సింగిల్ విండో మాజీ డైరక్టర్ బి. సత్తిరరెడ్డి, కేఎం. రెడ్డి, రాధారపు పెంటయ్య, రాధారపు శ్రీశైలం, రఘుపతి, కార్తిక్, అదిత్య, కౌశిక్, బోయపల్లి రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరీంగూడ గ్రామపంచాయతీ భవనం ప్రారంభం

**కీసర, జూన్ 10, ప్రభాతవార్త:**
కీసర మండలం కరీంగూడ నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని శనివారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రిని స్థానిక సర్పంచ్ గోపాల్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులను సక్రమంగా వినియోగించుకొని ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించాలని మంత్రి సూచించారు. గ్రామాభివృద్ధికి పాలకవర్గం అధికారుల సహకారంతో సమిష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మేడ్చల్ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, వైఎస్‌చైర్మన్ పూస వెంకటేశ్, కీసర ఎంపిపి మల్లారపు ఇందిరా లక్ష్మినారాయణగౌడ్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, పలువురు ఎంపిటిసీ సభ్యులు, సర్పంచులు, మండల బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



కరీంగూడలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనం ప్రారంభోత్సవలో పాల్గొన్న రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి

## నాగారంలో సుపరిపాలన దినోత్సవం



నాగారం మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

**కీసర, జూన్ 10, ప్రభాతవార్త:**
నాగారం మున్సిపల్ కార్యాలయంలో శనివారం సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ కౌకు ంట్ల చంద్రారెడ్డి కేక్ కట్ చేశారు. 2019 ఏప్రిల్ 21వ తేదీన నాగారం కొత్త పురపాలక సంఘంగా ఏర్పడిందని ఆయన తెలిపారు. ఈసందర్భంగా సుపరిపాలన దినోత్సవంపై మున్సిపల్ కమీషనర్ ఎ.వాణీ సమావేశంలో తెలియజేశారు. మున్సిపాలిటీ ప్రజలకు పారదర్శవంతమైన పరిపాలన అందించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్‌చైర్మన్ బండారి మల్లేశ్‌యాదవ్, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపిడిఓపై చర్యలు తీసుకోవాలి

**కడ్తాల్,జూన్ 10 ప్రభాతవార్త :** నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కడ్తాల ఎంపిడిఓ రామకృష్ణపై చర్యలు తీసుకోవాలని కడ్తాల ఎంపిపి కమ్లి మొత్యనాయక్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి బిసి సంక్షేమశాఖ నుంచి బిసి కులాలలోని కుల వృత్తుల వారికి ఆర్థిక ప్రోత్సాహం కోసం ప్రభుత్వం రూ. లక్ష పథకం లబ్దిదారుల ఎంపిక విషయంలో తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆమె విలేఖరులతో మాట్లాడారు. తాను గిరిజన మహిళా ఎంపిపిని అని చులకన చేస్తూ ఎంపిడిఓ మానసిక ఇబ్బందులను గురి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. అధికారుల ప్రోద్బలంతో ఎంపిడిఓ అన్ని విధాలుగా తనను వేధింపులకు గురి చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, జిల్లా అడ్మినిస్ట్రేషన్ ప్రివిలేజ్ కమిటికి ఫిర్యాదు చేస్తానని ఆమె తెలిపారు. ఎంపిడిఓ రామకృష్ణపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కమ్లిమొత్యనాయ్ కోరారు.

### మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు : ఎస్సై రమేశ్‌కుమార్

**దౌల్తాబాద్, జూన్ 10 ( ప్రభాతవార్త ):** దౌల్తాబాద్ మండల పరిధిలోని పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరంగా నిర్వహించారు. శనివారం రాత్రి మండల వ్యాప్తంగా నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం 97 మంది పట్టుబడగా కొడంగల్ మున్సిఫ్ కోర్టు జడ్జీ శ్రీరాం ముందు హాజరుపర్చినట్లు దౌల్తాబాద్ ఎస్సై రమేశ్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన వారికి ఒక్కొక్కరికి జరి మానాలను విధించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

**మొయినాబాద్, జూన్ 10 ప్రభాతవార్త:** గుర్తు తెలియని పురుగుల మందు తాగి వడ్డే పెంటయ్య (55) అనే వ్యక్తి చనిపోయాడు. మృతుని కుమారుడు వడ్డే శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వీరన్నపేట్ చిన్న మంగళారం గ్రామపంచాయతీకి చెందిన పెంటయ్య కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ప్రతి రోజు మద్యం సేవించి ఇంటికి వచ్చేవాడు. ఆ క్రమంలోనే ఈ నెల 8వ తేదీన మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. తర్వాత రోజు 9వ తేదీన ఉదయం 4 గంటల సమయంలో నోటి నుంచి నురగలు రావడం గమనించి దగ్గర ఉన్న భాస్కర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి ఉస్మానియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఉస్మానియాలో చికిత్స పొందుతూ ఈ నెల 9వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో చనిపోయాడు. తన తండ్రి ఏదో గుర్తు తెలియని పురుగుల మందు తాగి చనిపోయాడని, తమకు ఎవరిపైనా ఎటువంటి అనుమానం లేదని ఆ ఫిర్యాదులో కుమారుడు పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మన్య తెలిపారు.

## సుపరి పాలన అందించిన ఘనత కెసిఆర్‌దే

**-సుష్మామహేందర్ రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న సుష్మామహేందర్ రెడ్డి

**శంషాబాద్ జూన్10,ప్రభాతవార్త :**
రాష్ట్రంలో సుపరిపాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌కు మాత్రమే దక్కుతుందని శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కొలను సుష్మామహేందర్ రెడ్డి ,వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ పేర్కొన్నారు.రాష్ట్ర అవతరణ జరిగి పది సంవత్సరాలు పూరినత అయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శనివారం శంషాబాద్‌లోని వైఎస్ఆర్ గార్డెన్‌లో సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా సుష్మామహేందర్ రెడ్డి,గోపాల్ యాదవ్ మాట్లాడుతూ....9 ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని ఏకదాటిగా ముఖ్యమంత్రి పదవిని నిర్వహిస్తున్న కెసిఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా మంచి పరిపాలన అందిస్తున్నారని వారు పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి ప్రతి ఇంటికి లబ్ధి చేకూరే విధంగా పథకాలను రూపొందించిందని వారు వివరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బోగేశ్వర్లు,కౌన్సిలర్లు మేకల వెంకటేష్ ముదిరాజ్,తోకల విజయలక్ష్మి,పోతుగంటి సునీత దయానంద్,బధ్రు నాయక్,బండి భాగ్యలక్ష్మి శ్రీకాంత్ యాదవ్,పెద్దిరిపాటి రాణి యాదయ్య గౌడ్,స్రవంతి శ్రీకాంత్ రెడ్డి,కోనమోల్ల భారతమ్మ పారేపల్లి లావణ్య శ్రీనివాస్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## నర్కుడలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన యాదగిరి



**శంషాబాద్ జూన్10,ప్రభాతవార్త :**
క్రీడలలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని నర్కుడ గ్రామ పంచాయతీ సభ్యులు భ్యాగరి యాదగిరి పేర్కొన్నారు.గ్రామంలో నిర్వహిస్తున్న నర్కుడ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు.క్రీడాకారులకు టీ షర్టులను అందజేశారు.ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ....క్రీడాకారులకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని క్రమశిక్షణ పట్టదల ఉన్న వారే మంచి క్రీడాకారులుగా రాణించగలుగుతారని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాలను నిర్వహించడం వలన వారిలో దాగివున్న క్రీడా నైపుణ్యం వెలుగు చూస్తుందని పేర్కొన్నారు.

## సిఎం కెసిఆర్ చిత్రపటానికి దివ్యాంగుల క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే అంజయ్య, దివ్యాంగులు.

**షాద్‌నగర్, జూన్ 10, (ప్రభాతవార్త) :**
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగులకు వచ్చే నెల నుంచి ఫించన్ 1000 పెంచడంతో షాద్‌నగర్ నియోజకవర్గంలోని దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేశారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి దివ్యాంగులు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులు మాట్లాడుతూ... తమ ఫించన్‌ను రూ.4016కు పెంచడం చాలా సంతోషంగా ఉందని, ఇందుకు కారణమైన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని వారు అన్నారు. అదేవిధంగా నియోజకర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ మా అందరికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు సహితం కృతజ్ఞతలు తెలిజేయస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రేపు 2కే రన్

**షాద్‌నగర్, జూన్ 10, (ప్రభాతవార్త) :**
తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది దినోత్సవాల్లో భాగంగా షాద్‌నగర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 12న ఉదయం 7.45 నిమిషాలకు 2కే రన్ కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామని అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ షాద్‌నగర్ వారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం షాద్‌నగర్ మున్సిపాల్ కార్యాలయం నుంచి ప్రారంభమై స్టేడియం గ్రౌండ్ ముగుస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, ఫరూఖ్‌నగర్ మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రముఖులు తదితరులు పాల్గొనవాల్సిందిగా వారు ప్రకటనలో కోరారు.

## తెలంగాణ సంస్కరణలు దేశానికే ఆదర్శం

**-ఎంపిపి కమ్లిమొత్యనాయక్, జడ్పీటిసి దశరథ్ నాయక్**



తెలంగాణ సంస్కరణ వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**కడ్తాల్,జూన్ 10 ప్రభాతవార్త :**
రాష్ట్ర దశాబ్ది అవతరణ వేడుకల్లో భాగంగా కడ్తాల్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కమ్లి మొత్యనాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిపి కమ్లిమొత్యనాయక్, జడ్పీటిసి దశరథ్‌నాయక్‌లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సురిపాలన ఫలాలన్ని సుపరిపాలన ప్రతి వర్గానికి అందిస్తుందని వారన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రజలకు మరింత చేరువలో పాలన అందించాలని రాష్ట్రంలో కొత్త జిల్లాలను రెవెన్యూ డివిజన్ మండలాలను, గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసి ప్రజలకు సుపరిపాలన అందిస్తుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బావండ్లపల్లి ఆనంద్, ఎంపిడిఓ రామకృష్ణ, ఎంపిఓ మధుసూదనాచారి, మండల సర్పంచ్‌లు, ఎంపిటిసి మండల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యను అందించడమే లక్ష్యం

శామీర్‌పేట జూన్10,ప్రభాతవార్త : డబ్ల్యూఈఎక్స్‌ఎల్ ఎడ్యు ప్రైవెట్ లిమిటెడ్ దీర్ఘకాలిక వ్యూహాత్మక లక్ష్యాలకు అనుగుణంగా విలీనం,కొనుగోలు చేయడానికి లేదా ఇతర అనువైన అవకాశాల కోసం స్టాంపీడ్ క్యాపిటల్ లిమిటెడ్ (స్కప్ డివిఆర్) సంస్థ సూత్రపాయంగా ఆమోదం పొందింది. డబ్ల్యూఈఎక్స్‌ఎల్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఈక్విటి విలువను నిర్ణయించడానికి కంపెనీ పిడబ్ల్యుసి బిజినెస్ కన్సల్టింగ్ సర్వీసెస్ ఎల్ఎల్‌పిని నియమించింది.డబ్ల్యూఈఎక్స్‌ఎల్ అనేది పాఠశాలలు,కళాశాలలు,సంస్థలు,కోచింగ్ సెంటర్లు,ఇతర విద్యా సంస్థలు,వాటాదారులకు డిజిటల్ ప్లాట్ ఫాంను అందించే ఆన్‌లైన్ విద్యాసంస్థ.ఈ కంపెనీ ప్రస్తుతం 46 పాఠశాలలతో ఒప్పందాలు,ఎంఒయుల ద్వారా 27వేల మంది విద్యార్థులను చేర్చుకుంది. డబ్ల్యూఈఎక్స్‌ఎల్ ఒక ప్రత్యేకమైన పరిశోధన ఆధారిత ప్రోగ్రామ్ (మైక్రో లెర్నింగ్ ప్రోగ్రామ్ )ను అభివృద్ధి చేసింది.ఇది వినియోగదారుల పనితీరులో 30శాతం -50శాతం మెరుగుదలకు హామీ ఇస్తుంది.వాల్యూ అనాలిసిస్ ప్రకారం డబ్ల్యూఈఎక్స్‌ఎల్ ఈక్విటి విలువ రూ.91 కోట్ల నుంచి రూ.101కోట్ల మధ్య ఉంటుందని పీడబ్ల్యూసి అంచనా వేసి తన నివేదికలో తెలిపింది.

